**వరుణ్ దుగ్గిరాల ఉరఫ్ వరుణ్ దుగ్గి కళాకారుడే. కంటెంట్ క్రియేషన్ మనోడికి కొట్టినపిండి. పాడ్‌కాస్ట్‌లో పోటీ లేదు. పర్సనాలిటీ డెవలప్‌మెంట్ గురు కిరీటం ఉండనే ఉంది. ఆంత్రప్రెన్యూర్‌షిప్ వైపుగానూ అడుగులు వేస్తున్నాడు. ఊరు కాని ఊరు, భాష కాని భాష. అయితేనేం.. దున్నేస్తున్నాడు దుగ్గి. కాజాల నగరం కాకినాడలో పుట్టిన ఈ క్రియేటివ్ రాజా మనసులోని మాట వినండి..**

# ముంబైలో మనోడు!






> ప్రతి వ్యక్తి తన సమయాన్ని మూడు భాగాలు చేసుకోవాలి. వర్క్, లైఫ్, సెల్ఫ్. వర్క్.. వృత్తి ఉద్యోగాలకు. లైఫ్.. కుటుంబానికి. సెల్ఫ్.. కేవలం తనకోసం.

కాకినాడ మా సొంతూరు. పుట్టి పెరిగింది, పదో తరగతి వరకు చదివింది అక్కడే. చిన్నప్పటి నుంచీ 'థింక్ అవుటాఫ్ ద బాక్స్' బ్యాచీ మనది. కుతూహలం ఎక్కువ. ఇంట్లో పేరెంట్స్‌ను, స్కూల్లో ఉపాధ్యాయులను సందేహాలతో ఉక్కిరిబిక్కిరి చేసేవాణ్ని. 'రోజూ అన్నం తింటావా? క్వశ్చన్ బ్యాంకులు తింటావా?' అని విసుక్కునేవారు టీచర్స్. సాంస్కృతిక కార్యక్రమాల్లో చాలా ఉత్సాహంగా పాల్గొనేవాడిని. పన్నెండేండ్లు వచ్చే వరకు 'సిగ్గు' తెలియకుండా పెరిగాను. పెద్దవాళ్లు డ్యాన్స్ చేయమంటే చేసేవాడిని. ఎవరైనా నవ్వినా సిగ్గు అనిపించేది కాదు. భయమూ ఉండేది కాదు. టీనేజ్ తర్వాతే.. సిగ్గు తెలిసింది. నన్నెవరైనా జడ్జ్ చేస్తారేమోననే భయం మొదలైంది. అలా ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్‌కు లోనయ్యాను. జనంలోకి వెళ్తే కాన్ఫిడెన్స్ లెవెల్ తగ్గేది.

> ప్రతి చిన్న విషయం గురించీ, ప్రతి చెత్త సమస్య గురించీ ఆలోచిస్తూ సమయాన్ని వృథా చేసుకోవద్దు. నీ నియంత్రణలో ఉన్న విషయాల గురించి మాత్రమే ఆలోచించు.

**అత్తెసరు మార్కులే..**

యాక్టివ్‌గా, క్రియేటివ్‌గా ఉన్నా.. మార్కులు మాత్రం అంతంత మాత్రమే. బిలో యావరేజ్ అనుకోండి. కాకపోతే, ఇంట్లో మంచి సపోర్ట్ ఉండేది. మొత్తానికి స్కూల్ డేస్ హ్యాపీగా సాగిపోయాయి. ఇంటర్ బెంగళూరులో చదివాను. కంప్యూటర్ ప్రోగ్రామింగ్ చాలా ఇష్టం. కానీ బీటెక్ కంప్యూటర్ సైన్స్‌లో సీటు రాలేదు. దీంతో మెకానికల్‌లో చేరాను. జాబ్ చేసే ఆలోచన లేదు కాబట్టి, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌కి వెళ్లలేదు. ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్‌లో ఓ లిక్కర్ బ్రాండ్‌కు ప్రమోటర్‌గా చేరాను. రోజూ బార్‌కు వెళ్లడం, అక్కడి వాళ్లతో మాట్లాడటం. గిఫ్ట్స్ పంచడం. ఇలా రోజుకు మూడు గంటలే పని. కొత్త వాళ్లను కలవడం వల్ల చాలా నేర్చుకున్నాను. ఆ తర్వాత ఓ కాల్ సెంటర్‌లో చేరాను. ఏడు నెలలు పనిచేశాను. చిన్నా చితకా కొలువుల తర్వాత.. సింబయాసిస్ ఇన్‌స్టిట్యూట్ వారి ఆడియో విజువల్ ప్రొడక్షన్ కోర్స్‌లో చేరాను. అది పూర్తయిన వెంటనే ఎంటీవీలోకి అడుగుపెట్టాను. తర్వాత చానెల్ వీలో చేరాను. షోలు ప్రొడ్యూస్ చేశాను. కొన్ని షోలకు డైరెక్టర్‌గా వ్యవహరించాను. నాలుగేళ్లు గడిచాక ఫ్రెండ్ రోహిత్‌తో కలిసి 'ద గ్లిట్జ్' అనే అడ్వర్టయిజింగ్ ఏజెన్సీ స్టార్ట్ చేశాను. ఇద్దరితో మొదలైన కంపెనీ ఏడుగురు ఉద్యోగులకు చేరుకుంది. కంపెనీని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో దాన్ని అమ్మేశాం. చాలా డబ్బే వచ్చింది. రెండేళ్ల క్రితం వరకూ అందులోనే పని చేశాను. ఇప్పుడు మేం మొదలుపెట్టిన కంపెనీలో 700 మంది పని చేస్తున్నారు. పాడ్‌కాస్టింగ్ నా అభిరుచి. 'అడ్వర్టయిజింగ్ ఈజ్ డెడ్' పాడ్‌కాస్ట్ ఆపిల్ ర్యాంకింగ్‌లో అగ్రస్థానంలో ఉంది. పుస్తకాలూ రాశాను. 'ఎవ్రీథింగ్ ఈజ్ అవుటాఫ్ సిలబస్' నా తాజా రచన. రాయాలంటే చదవాలి. మాట్లాడాలంటే ఆలోచించాలి. ఈ రెండూ లేకపోతే నేను ఉన్నా లేనట్టే. తెలుగువాడినైనా ఇంగ్లిష్‌లో రాయడానికి ప్రత్యేక కారణాలేమీ లేవు. పాడ్‌కాస్ట్, హోస్ట్‌గా ఏది చేసినా కొత్తగా, క్రియేటివ్‌గా ఉంటుంది. వ్యాపారవేత్తలతో నాయకత్వం గురించి మాట్లాడతాను, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో ఆలోచనలు పంచుకుంటాను. సెలబ్రిటీలను పర్సనల్ లైఫ్ గురించి గుచ్చిగుచ్చి అడుగుతాను. నా సంభాషణల్లో లైఫ్, నాలెడ్జ్, ఎంటర్‌టైన్‌మెంట్ కలగలిసి ఉంటాయి. నేను జనం మనిషిని. ఎంతమందితో మాట్లాడితే అంత ఆనందం. మా ఆవిడ పూజ, కూతురు లియా నాకు ఇన్‌స్పిరేషన్. నేను ఆంత్రప్రెన్యూర్ కాదు.. ఫాదర్‌ప్రెన్యూర్! లియా పెంపకం కూడా నా దినచర్యలో భాగమే. కుటుంబం మనిషిని తీర్చిదిద్దుతుంది. మనిషి కుటుంబాన్ని తీర్చిదిద్దుకుంటాడు. అనుబంధాలు బలంగా ఉన్నప్పుడే.. జీవన ప్రయాణమూ పదిలంగా సాగుతుంది.■

> ఫాస్టింగ్‌తో మన శరీర వ్యవస్థ కొత్త శక్తిని సంపాదించుకుంటుంది. అలాంటిదే బ్రెయిన్ ఫాస్టింగ్. ఆ సమయంలో దేని గురించీ ఆలోచించకుండా గడిపేయాలి.

> డబ్బు కోసం ఉద్యోగమో, వ్యాపారమో చేస్తావు సరే. కానీ డబ్బుతో సంబంధం లేకుండా.. కేవలం ఆనందం కోసమే ఏదో ఓ వ్యాపకాన్ని ఎంచుకో. త్వరలోనే అది నీ ఇంట డబ్బుల పంట పండిస్తుంది.

> నువ్వు ఏం అనుకుంటావో అది నేను కాదు. నేను ఏం అనుకుంటానో అది కూడా నేను కాదు. నువ్వు ఏం అనుకుంటావని నేను అనుకుంటానో.. అదే నేను! లోతుగా ట్విస్టింగ్‌గా ఉంది. లోతుగా ఆలోచించండి చిక్కుముడి వీడిపోతుంది.